క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణంలో విద్యుత్ స్తంభాలను సరిచేసేందుకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. రంగంపల్లి శివారు బీసీ హాస్టల్, ఇండేన్ గ్యాస్ గోదాం, హనుమాన్ టెంపుల్ ప్రాంత వినియోగదారులు సహకరించాలన్నారు.

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు, మద్యం సీసాలు వేయొద్దని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కోరారు. సోమవారం పలు కాలనీల్లో మున్సిపల్ కార్మికులు చేస్తున్న పనులను పరిశీలించారు. క్రీడలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మైదానంలో జరిగే అవకాశమున్నందున క్రీడాకారులు శుభ్రం చేయాలని కోరడంతో శుభ్రం చేయిస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కోల్‌సిటీ: నగరపాలక సంస్థలో 100 రోజుల కార్యాచరణలో భాగంగా డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది సోమవారం స్థానిక రాంనగర్‌లో పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు.

రక్తదానం

సుల్తానాబాద్‌రూరల్: ముత్తారం గ్రామానికి చెందిన లక్ష్మి అనే పేషెంట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. రక్తం అవసరముందని వైద్యులు తెలిపారు. సోమవారం ఐతరాజుపల్లి గ్రామానికి చెందిన మడ్డి సాయికిషోర్‌గౌడ్ రక్తదానం చేశారు. 31వసారి రక్తదానం చేశానని సాయికిషోర్‌గౌడ్ తెలిపారు.

సిగ్నల్ లైట్లు ఏర్పాటు

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల రోడ్డు, రాజీవ్ రహదారి, పోలీస్ స్టేషన్ రోడ్డు, కాల్వశ్రీరాంపూర్ చౌరస్తాల్లో ట్రాఫిక్ పోలీసులు సిగ్నల్ లైట్ల ఏర్పాటు పూర్తి చేశారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వారసంతకు వచ్చిన ప్రజలు సిగ్నల్ ఉండడం వల్ల ప్రమాదాల నివారణతోపాటు వాహనదారుల వేగ నియంత్రణతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో ట్రాఫిక్ సిగ్నల్ ప్రారంభించే అవకాశముందని అధికారులు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌ను నియమించాలి

ఓదెల: తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌ను నియమించాలని మండల ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు. గతంలో డీటీగా పని చేసిన శ్రీనివాస్‌గౌడ్‌ను ఇటీవల బదిలీ చేశారు. ప్రస్తుతం డీటీ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆదాయ సర్టిఫికెట్ల జారీ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని విద్యార్థులు, ప్రజలు వాపోతున్నారు.

కార్యవర్గం ఎన్నిక

రామగిరి: సెంటినరీకాలనీ పురిగిరి క్షత్రియ పెరిక సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉగ్గే కుమార్, ప్రధాన కార్యదర్శిగా దొమ్మటి రవీందర్, కోశాధికారిగా కందుల సదయ్య, గౌరవ అధ్యక్షుడిగా చుంచు కనకయ్య, గౌరవ సలహాదారుగా నరెడ్ల శ్రీనివాసరావు, బుద్దె శంకరయ్య, ఉపాధ్యక్షులుగా మార్త సతీశ్, దుండె రాజేందర్, సహాయక కార్యదర్శిగా నరెడ్ల రమేశ్, కార్యవర్గ సభ్యులుగా కొట్టే భీమయ్య, చింతం మహేందర్, అంకతి సంతోష్, గొర్ల కుమార్, దొంగరి రమేశ్ ఎన్నికయ్యారు.

పరామర్శ

ధర్మారం: రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కోఆర్డినేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డిని సోమవారం మండల గౌడ సంఘం నాయకులు పరామర్శించారు. ప్రకాశ్‌రెడ్డి తల్లి లక్ష్మీభాయి అనారోగ్యంతో ఇటీవల మరణించగా.. భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం వాళ్లెంకుంట గ్రామంలో ఉన్న ప్రకాశ్‌రెడ్డిని రాష్ట్ర గౌడ సంఘం నాయకులు తాళ్లపెల్లి లింగయ్య, నాగుల రాజేశం, బాలసాని చంద్రమౌళి ఓదార్చారు.

బహిరంగ సభకు తరలిరావాలి

జూలపల్లి: బీడీ కార్మికులు, వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికుల పింఛన్ల పెంపు కోరుతూ ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన ఎంఆర్‌పీఎస్ బహిరంగ సభ విజయవంతానికి తరలిరావాలని మండల ఇన్‌చార్జి సీపెల్లి అంజయ్య కోరారు. జూలపల్లిలో మాట్లాడుతూ.. వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

రాఖీ కట్టిన ఎమ్మెల్యే సతీమణి



యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ చేతికి సోమవారం రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ రాఖీ కట్టారు.

కుల ధ్రువీకరణలో మార్పు..!

జ్యోతినగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయడంలో పలు మార్పులు చేసింది. గోదావరిఖని ప్రాంతంలోని ఓ మీసేవ కేంద్రం నుంచి కుల ధ్రువీకరణ పత్రం పొందినా మరోసారి దరఖాస్తు చేసి కొత్త ధ్రువీకరణ పత్రాన్ని పొందే అవకాశం గతంలో ఉండేది. ప్రస్తుతం కులం మారదు కనుక ఇప్పుడు పాత విధానానికి స్వస్తి పలకడంతోపాటు కొత్త విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. కుల ధ్రువీకరణ పత్రం గతంలో కమ్యూనిటి డేట్ ఆఫ్ బర్త్‌గా వచ్చేది. దీంతోపాటు ఆధార్ కార్డు ప్రకారం పుట్టిన తేదీ వివరాలు కూడా వచ్చేవి. ప్రస్తుతం కుల ధ్రువీకరణ పత్రంలో జనన వివరాలు అవసరం లేదని ప్రభుత్వం గుర్తించింది. పత్రంలో ఈ వివరాలను తొలగించి కేవలం కమ్యూనిటీ సర్టిఫికెట్ పేరుతో కొత్త ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తోంది. కొత్త విధానంతో ధ్రువీకరణ పత్రాలు పొందడానికి క్షణాల్లో పని పూర్తయితే బాగానే ఉంటుంది కాని.. గతంలో పొందిన కుల ధ్రువీకరణ పత్రాల్లో తప్పులుంటే వాటిని మార్చుకునే విధానం లేదు.



కొత్తగా మార్పు చేసిన కుల ధ్రువీకరణ పత్రం

మార్పులపై వివరిస్తున్నాం



కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులకు సంబంధించి కొత్తగా వచ్చిన మార్పులపై ప్రజలకు వివరిస్తున్నాం. గతంలో పొందిన ధ్రువీకరణ పత్రమే కొత్త తేదీతో కొత్తగా వస్తుందని అవగాహన కల్పిస్తున్నాం.

– పల్లె బాపు, మేనేజర్, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ మీసేవ కేంద్రం

నులిపురుగు నివారణకు కృషి చేయాలి



ధూళికట్ట పాఠశాలలో మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఎలిగేడు: నులిపురుగు నివారణకు ప్రభుత్వం అందిస్తున్న అల్బెండజోల్ మాత్రలను 1 నుంచి 19 ఏళ్ల లోపు వారందరూ వేసుకొని నులిపురుగును నివారించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీరాములు అన్నారు. ధూళికట్ట జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవంలో భాగంగా మాత్రలు పంపిణీ చేశారు. ఎలిగేడు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎంపీవో కిరణ్, హెచ్‌ఎం దేవేందర్‌రావు, మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 3,378 మందికి గాను 2,609 మందికి మాత్రలను అందజేశారు. నాగమణి, లక్ష్మణ్, డాక్టర్ సింధూర, వినయ తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఉన్న చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను వైద్య సిబ్బంది వేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సంపత్‌రెడ్డి మాత్రల పంపిణీ ప్రారంభించారు. అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్: నట్టల నివారణ కోసం ప్రతీ విద్యార్థి మాత్ర వేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ అన్నారు. పలు ప్రభుత్వ, ప్రయివేట్, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌ఎన్ సౌందర్య, భారతి హెల్త్ సూపర్‌వైజర్ లురోజా, ఎలిజిబెత్ రాణి తదితరులున్నారు.

ముత్తారం: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జెడ్పీ పాఠశాల, జూనియర్ కళాశాల తదితర పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వ వైద్యుడు అమరేందర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. జెడ్పీ హెచ్‌ఎం పద్మావతి, కళాశాల ప్రిన్సిపాల్ జీఎల్ఎన్‌రావు, కేజీబీవీ ఎస్‌వో స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో పాఠశాల విద్యార్థులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు మహేందర్, శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ నీరజ, సరోజన, ఏఎన్‌ఎంలు సునీత, పద్మ, సరోజన, విజయ, కవిత, సరిత, సుధారాణి, శైలజ, శోభ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నారులకు వైద్య సిబ్బంది మాత్రలు పంపిణీ చేశారు. బేగంపేట ప్రభుత్వ జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో కలిసి మండల వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ మాత్రలు అందజేశారు.

ఓదెల: కొలనూర్, ఉప్పరపల్లె గ్రామాల్లో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఏసుదాసు, హెచ్‌ఈవో శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు కిశోర్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

హద్దు రాళ్లు ఏర్పాటు



రామగిరి: సింగరేణి స్థలం కబ్జాకు యత్నం అని సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి సోమవారం సింగరేణి అధికారులు స్పందించారు. ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–2కు వెళ్లే దారిలో స్థలాన్ని కబ్జాకు ప్రయత్నిస్తున్నారని తెలపడంతో.. సర్వే అధికారులు సర్వే నిర్వహించి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో ఎలాంటి కబ్జాలకు పాల్పడకుండా సింగరేణి స్థలం చుట్టూ కందకం తవ్వారు.

సాక్షి స్పందన

తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీవో

కాల్వశ్రీరాంపూర్: జాఫర్‌ఖాన్‌పేట గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అధికారులు సోమవారం గ్రామానికి వెళ్లి చర్యలు తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం వార్డు మాజీ సభ్యుడు తిప్పని శ్రావణ్ తాగునీటి సమస్య పరిష్కరించాలని నీటి ట్యాంకు పైకి ఎక్కి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఇకముందు ఇటాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని అధికారులు పేర్కొన్నారు. ఎంపీవో ఆరిఫ్‌హుస్సేన్, ఆర్‌డబ్ల్యూ ఏఈ కోర్నాల్, పంచాయతీ కార్యదర్శి శంకర్, పంపు డ్రైవర్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

మంథని: ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులోని గాడుదులగండి ఘాట్ వద్ద సోమవారం రూ.50,575 విలువైన 2.023 కేజీల గంజాయి పట్టుకున్నట్లు గోదావరిఖని ఏసీపీ రమేశ్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా, విక్రయాలను అడ్డుకునేందుకు నిఘా వేయగా.. గంజాయితో పట్టుబడిన ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. మంథనికి చెందిన బండారి అభిషేక్, ఇద్దరు మైనర్లు ఆదివారం గాడుదులగండి వద్ద కలుసుకని రూ.21వేలు పట్టుకుని మహారాష్ట్రలోని తోడ్స గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. అక్కడ విష్ణు వాగ్దే, మరోవ్యక్తి వద్ద గంజాయి, రెండు కత్తులు కొనుగోలు చేశారు. రాత్రి అక్కడే పడుకొని సోమవారం బయలు దేరారు. గాడుదులగండి వద్దకు చేరుకుని కొందరు స్నేహితుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో అందించిన సమాచారం మేరకు ఎస్సై రమేశ్ నిఘా వేసి వారిని పట్టుకున్నారు. ఈ ముగ్గురితోపాటు సూరయ్యపల్లికి చెందిన రవిసాగర్, ఖానాపూర్‌కు చెందిన అజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. మంథని ప్రాంతంలో 15 నుంచి 20 మంది ఈ దందాలో ఉన్నట్లు సమాచారం అందిందని, వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు.

మత్తు పదార్థాలను నిషేధించాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో అత్యధికంగా యువత డ్రగ్స్‌కు అలవాటు పడి బానిసై తమ విలువైన జీవితాలను వృథా చేసుకుంటున్నారని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహాయ కార్యదర్శి పెండ్యాల రమేశ్ అన్నారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పీవైఎల్ ఆధ్వర్యంలో అంతర్గాం ఎస్సై వెంకటస్వామికి లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. పీవైఎల్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ప్రతినిధులు మాట్లాడుతూ.. గుట్కాలు, డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలను నిషేధించే దిశగా పోలీసు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు.

మెడికల్ కళాశాల ఎదుట నిరసన

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాల ఎదుట సోమవారం ఏఐఎఫ్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రిన్సిపాల్ జోక్యం మితిమీరుతోందని జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ఆరోపించారు. వారంలో మూడు రోజులు మాత్రమే ప్రిన్సిపాల్ కళాశాలకు వస్తున్నారని, మిగతా రోజులు రావడం లేదన్నారు.

పెద్దపల్లిలో పెరుగుతున్న చిల్లర దొంగలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలో రోజురోజుకు చిల్లర దొంగతనాలు పెరిగిపోతున్నాయి. పట్టణ శివారు పెద్దమ్మనగర్ ప్రాంతంలోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో సోమవారం చూస్తుండగానే క్షణాల్లో సెల్‌ఫోన్‌ను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించి బైక్‌పై పారిపోయారు. కాలువ పక్కన కిరాణ దుకాణం యజమాని తన సెల్‌ఫోన్‌ను చార్జింగ్ పెట్టుకున్నాడు. బైక్‌పై ఇద్దరు యువకులు రాగా.. ఒకరు బైక్‌పై ఉన్నారు. మరో యువకుడు సిగరెట్ కొని నిల్చున్నాడు. ఇంతలో దుకాణానికి వచ్చిన వ్యక్తితో యజమాని మాటల్లో ఉన్నట్లు గమనించి చార్జింగ్‌లో ఉంచిన సెల్‌ఫోన్ ఎత్తుకొని బైక్‌పై పారిపోయారు. దుకాణ యజమానితో స్థానికులు వెంటనే అప్రమత్తమై వెంబడించినా ఆచూకీ దొరకలేదు. సీసీ ఫుటేజీల ఆధారంగా అమర్‌నగర్ మీదుగా వెళ్లినట్టు గుర్తించారు. ఆదివారం పెద్దపల్లి బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు యత్నిసున్న వ్యక్తి జేబులో నుంచి పర్సు అపహరించి పరారయ్యాడని స్థానికులు తెలిపారు. పర్సులో రూ.6వేల నగదుతోపాటు ఇతర గుర్తింపు కార్డులున్నట్లు తెలిసింది. బస్టాండ్‌తోపాటు పట్టణంలో పోలీసులు పెట్రోలింగ్ పెంచాల్సిన అవసరముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రైతు బీమాకు 2 రోజులే అవకాశం

సుల్తానాబాద్‌రూరల్: రైతు బీమా పథకం కింద కొత్తగా దరఖాస్తులు చేసుకునే రైతులకు బుధవారం వరకే తుది గడువుందని ఏఈవోలు పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో సోమవారం ఏఈవోలు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. గతంలో ఈ పథకంలో ఉన్న రైతులు తమ వివరాలను సరిచూసుకోవాలని, ఈ సంవత్సరం కొత్త మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయగా.. ఆగస్టు 14 నుంచి పథకం అమల్లోకి వస్తుందన్నారు. ఏఈవోలు సౌమ్య, పద్మ, రవితేజ, ప్రశాంత్, స్వప్న, రాజు తదితరులున్నారు.

జ్యోతినగర్: రామగుండం మండలంలో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన అర్హతున్నవారు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.ప్రకాశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 లోపు పూర్తి వివరాలతో వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు అందించాలని సూచించారు.

రామగిరి: మండలంలో నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ అన్నారు. సోమవారం రత్నాపూర్ రైతు వేదికలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

యూరియా పంపిణీ

పాలకుర్తి: మండల పరిధిలోని రైతులకు సోమవారం యూరియా బస్తాలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని రైతులకు గాను 2 ప్రాథమిక సహకార సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాల్లో నిల్వ ఉన్న 50 మెట్రిక్ టన్నుల యూరియాను ఒక ఎకరానికి బస్తా చొప్పున పుట్నూర్, కుక్కలగూడుర్, కన్నాల సింగిల్‌విండో గోదాంల వద్ద ఏఈవోల సమక్షంలో పంపిణీ చేశారు.

సామాజిక తనిఖీలో దుర్వినియోగమైన నిధులు రికవరీ



ప్రజావేదికలో పాల్గొన్న ఏపీడీ సత్యనారాయణ

ధర్మారం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గతేడాది 2024 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఉపాధిహామీ నిధులతో ఖర్చు చేసిన పనులకు సంబంధించి పది రోజులపాటు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఉపాధిహామీ, పంచాయతీరాజ్ రికార్డుల ప్రకారంగా ఖర్చు చేసిన రూ.9.82కోట్ల పనులకు సంబంధించి తనిఖీలు చేశారు. 29 గ్రామ పంచాయతీల్లో పనులకు సంబంధించిన తనిఖీల రిపోర్టును సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికలో అధికారులకు వివరించారు. దుర్వినియోగం చేసిన రూ.22,750 రికవరీ చేస్తూ రూ.8,500 ఫెనాల్టీ వేసినట్లు ఏపీవో రవీందర్ తెలిపారు. ఏపీడీ సత్యనారాయణ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డీపీవో కొమురయ్య, ఎంపీవో రమేశ్, ఏఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో రైళ్లన్నీ కిటకిట



రామగుండం: శ్రావణ శుక్రవారం, శనివారం రక్షాబంధన్, ఆదివారం.. ఇలా 3 రోజులపాటు వరుసగా సెలవులు రావడంతో వేలాదిమంది తమ స్వస్థలాలకు చేరుకున్నారు. తిరుగు పయనంలో రైల్వే స్టేషన్లు, రైళ్లు, ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. ప్రధానంగా హైదరాబాద్-కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్, తెలంగాణ, పట్నా తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

ఉచిత వైద్యశిబిరం

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని రమేశ్‌నగర్‌లో సోమవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదర్శ ఆటో యూనియన్ అడ్డా ఆటో డ్రైవర్లకు ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, డీఎంవో డాక్టర్ హర్షిత్ షుగర్, బీపీ, ఈసీజీ తదితర రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. మెడికవర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించాలనే ఉద్దేశంతోనే వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతంపై ఫిర్యాదు

ఓదెల: పొత్కపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 666లోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు అన్యాక్రాంతం చేశారని ఇదే గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకుడు శనిగరపు రమేశ్ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రవేశ ద్వారం ఎదుట చెత్త పేరుకుపోతోంది. ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులతోపాటు సాయంత్రం ఆకతాయిలు ఇష్టం వచ్చినట్లు కాగితాలు, చెత్తను పడేస్తున్నారు. కళాశాల ద్వారం వద్ద దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన ర్యాంపు చెత్తతో నిండి వాడడం లేదు. రాత్రివేళ ఆకతాయిలు, మద్యం ప్రియులు తాగిన సీసాలు కళాశాల ఎదుట పడేసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో చెత్త పేరుకుపోతోంది. చెత్త వేయకుండా ప్రిన్సిపాల్, అధ్యాపకులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఏపీఏ జీఎం నాగేశ్వరరావు

రామగిరి: ప్రతీ ఉద్యోగి సమయపాలన పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలని ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలోని సమవేశ మందిరంలో ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎం వెంకటరమణతో కలిసి వివిధ గనులు, విభాగాల అధిపతులు, అధికారులతో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సంస్థ స్థితిగతులు, ఏరియా ఆర్థిక పరిస్థితులపై అవగాహన కల్పించారు. ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రరెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్లు వై.వి.శేఖరబాబు, కె.యాదయ్య, ఎస్‌వోటూ జీఎంలు ఎం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జె.రాజశేఖర్, ప్రవీణ్ వి ఫొంటింగ్, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న దర్మపురి

రామగిరి: పది సంవత్సరాలు టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న కవిత ఆనాడు కార్మికుల సమస్యలను మరిచి నేడు సింగరేణిలో రాజకీయ జోక్యం అని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దర్మపురి అన్నారు. సోమవారం సెంటినరికాలనీ శ్రీపాద భవన్‌లో ఆర్జీ–3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లలో సింగరేణి నిధుల నుంచి కార్మికుల రూ.30వేల కోట్లు దుర్వినియోగం చేసి కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేకు రూ.2కోట్లు నిధులు కేటాయించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నాయకులు సదానందం, వడ్డెపల్లి దాస్, ఆరెపల్లి శ్రీనివాస్, రామారావు, మనోహర్, మడ్డి రాజ్‌కుమార్, వెంకటస్వామి, ఉడుత శంకర్, కిరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, సర్వన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితోనే భవిష్యత్

గోదావరిఖని: నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితోనే సంస్థకు భవిష్యత్ ఉంటుందని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులు నెహ్రూ, సుజన్‌మెహ్రా, అరవిందరావు, ధనుంజయ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏరియాలోని యూనియన్ ప్రతినిధులతో సమావేశమై ఎల్ఈడీ డిస్‌ప్లే ద్వారా గణాంకాలతో సహా సంస్థ పరిస్థితి వివరించారు. ఈనెల 15న ఏరియాలోని కమ్యూనిటీ హాల్‌లో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు, ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు జీఎం సూచించారు.

కార్మిక సమస్యలపై రాజీ లేని పోరాటం

పెద్దపల్లిరూరల్: పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిన జిల్లాలో కార్మిక సమస్యలపై రాజీ లేని పోరాటం సాగిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. పెద్దపల్లిలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. అక్టోబర్ 25, 26ల్లో 4వ మహాసభలను నిర్వహించుకునేందుకు వీలుగా ఆహ్వాన సంఘాన్ని ఖరారు చేసుకున్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

కాల్వశ్రీరాంపూర్: కరాటేతో విద్యార్థుల్లో ఆత్మరక్షణతోపాటు ఆత్మస్థయిర్యం పెంపొందుతుందని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కాల్వ లీలావతి రాంచంద్రారెడ్డి నిలయం వేదవ్యాస హైస్కూల్లో విద్యార్థులకు ఆల్ ఇండియా దమ్మిక కాయ్ కరాటే ఫెడరేషన్ ఇంటర్ నేషనల్ ఆధ్వర్యంలో కరాటే గ్రేడింగ్ టెస్ట్‌లో తెలంగాణ స్టేట్ స్టయిల్ చీఫ్ ప్రసన్న కృష్ణ పర్యవేక్షణలో కల్వల రమేశ్ అధ్యక్షతన కరాటే పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రీన్, బ్రౌన్ బెల్టులు, ప్రశంసాపత్రాలు సారయ్యగౌడ్ చేతుల మీదుగా అందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజమల్లు, మాజీ సర్పంచ్ సతీశ్, ఆరెల్లి రమేశ్, ఉమామహేశ్వర్, సౌమ్య, దివాకర్‌రెడ్డి, కోట సదయ్య తదితరులు పాల్గొన్నారు.

సెంటినరీకాలనీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మారుతి

రామగిరి: సెంటినరికాలనీ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కల్వచర్ల గ్రామానికి చెందిన మేకల మారుతియాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికవగా.. సోమవారం శ్రీలక్ష్మి గార్డెన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ రేకులపల్లి శశాంక, జోనల్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు, డిస్ట్రిక్ట్ ఉప గవర్నర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శిగా అబ్బు కేశవరెడ్డి, కోశాధికారిగా కొప్పుల శ్రీపాదరావు, చీఫ్ కోఆర్డినేటర్‌గా ముల్కూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కదారి కళాధర్‌రెడ్డి, దుబ్బాక సత్యరెడ్డి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా డా.శరణ్యయాదవ్, ఎడ్యుకేషనల్ సర్వీస్ ఇన్‌చార్జిగా జి.సత్యనారాయణ, మెంబర్షిప్ ఇన్‌చార్జిగా కాటం సత్యం, మీడియా ఇన్‌చార్జిగా పీవీరావు, సోషల్ సర్వీస్ ఇన్‌చార్జిగా టీవీ సురేశ్ బాబు, క్లబ్ డైరెక్టర్లుగా మిర్యాల రాజిరెడ్డి, గంట వెంకటరమణారెడ్డి, పున్నం మధుకర్‌రెడ్డి, ఎల్లంకి రామారావు, బెల్లం శ్రీనివాస్, దొడ్ల శ్రీనివాస్, ఇ.లక్ష్మీనారాయణ, జి.శ్రావణ్‌కుమార్, గుండా శ్రీనివాస్, ఎలువక ఓదెలు, పరాంకుశం శ్రీనివాసాచారి ప్రమాణ స్వీకారం చేశారు.

మాతో కలిసి రండి

యైటింక్లయిన్‌కాలనీ: భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి మా పోరాటంలో మాతో కలిసి రావాలని కాంగ్రెస్ యువజన జిల్లా వైస్ ప్రెసిడెంట్ మహేశ్ కోరారు. సోమవారం కాలనీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరు మాతో చేరుతున్నట్లు 9650003420 ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. సాగర్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

ఓదెల: మండల పరిధిలో అరుణ్‌కుమార్ అనే వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆధార్ కార్డు, సీఈఆర్ పోర్టల్ ద్వారా పట్టుకొని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై దికొండ రమేశ్ సోమవారం అప్పగించారు.